# 20 శాతం పెరిగిన అట్టపెట్టెల ధర

## ఎస్ఐసీబీఎంఏ వెల్లడి



విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్ఐసీబీఎంఏ అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి

**కోడంబాక్కం:** ముడి పదార్థాల ధరలు, కార్మిక వేతనాలు పెరిగిన నేపథ్యంలో తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలలో అట్టపెట్టెల ధరలను 20శాతం పెంచుతున్నట్లు దక్షిణ భారత అట్టపెట్టెల తయారీ సంఘం (ఎస్ఐసీబీఎంఏ) ప్రకటించింది. ఏప్రిల్ 1వ తేదీ నుండి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని సంఘం అధ్యక్షులు అనిల్‌కుమార్ రెడ్డి శుక్రవారం చెన్నైలో వెల్లడించారు. అట్టపెట్టెల పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, నష్టాల నుండి తేరుకోవాలంటే ధరల పెంపు అనివార్యమైందని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అట్టపెట్టెల తయారీ మొత్తం వ్యయంలో 60-70శాతం వరకు ముడి పదార్థాల్లో ప్రధానమైన క్రాఫ్ట్ పేపర్‌కే పోతుందన్నారు. ప్రతి ఏడాదీ క్రాఫ్ట్ పేపర్ ధర పెరుగుపోతూనే వుందని, 2011 నుండి 20శాతం పెరిగాయని చెప్పారు. దీనికితోడు కార్మికుల కూలీ 50శాతం పెరిగిందని, రవాణా, ఇతర ఖర్చులు 30శాతం పెరిగాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర విద్యుత్ కోతల కారణంగా జనరేటర్లు ఉపయోగించాల్సి వస్తోందని, ఇది తమకు అదనపు భారంగా మారుతుందన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో వెయ్యికిపైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అట్టపెట్టెల తయారీపై ఆధారపడి వున్నాయని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఈ రెండు రాష్ట్రాల్లో అట్టపెట్టెల ధరలు పెంచినట్లు తెలిపారు. అట్టపెట్టెల తయారీ పరిశ్రమ నష్టాల నుంచి బయటపడేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత క్రాఫ్ట్ పేపర్ దిగుమతులపై ఎస్ఎస్ఐ ఎక్సైజ్ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల నుండి రూ.3 కోట్లకు పెంచాలని కోరనున్నట్లు అనిల్ కుమార్ రెడ్డి చెప్పారు. అట్టపెట్టెల ధరలు చివరిసారి మూడేళ్ల క్రితం పెరిగాయి.

---

శనివారం 22 మార్చి, 2014

# అట్టపెట్టెల ధర 20శాతం పెంపు




**చెన్నై, న్యూస్‌టుడే:** అట్టపెట్టెల ధరలను 20 శాతం వరకు పెంచుతున్నట్లు దక్షిణభారత అట్టపెట్టెల సంఘం తెలిపింది. ముడిసరకుల ధర పెరిగిన కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చిందని సంస్థ కార్యవర్గ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కొత్త ధరల అమలు తమిళనాడు, పుదుచ్చేరిల్లో ఈ ఏడాది ఏప్రిల్-1 నుంచి అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు.

← సమావేశంలో పాల్గొన్న అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు